III
తెలంగాణ జైత్రయాత్ర 2023
నమస్తే తెలంగాణ
హైదరాబాద్ | గురువారం 2 నవంబర్ 2023 www.ntnews.com

ఆకాశంలో మెరుపులు క్షణకాలం
కేసీఆర్ సర్.. 'కారు'ంటే సంక్షేమం కలకాలం

రైతు బాంధవుడే మళ్లీ వస్తాడు
రైతు బంధు మళ్లీ ఇస్తాడు

దునియా మెచ్చింది స్వయం పాలన ప్రొగ్రెస్ కార్డు
దక్షిణాదిలో ఖాయం సరికొత్త రికార్డు

దుబ్బాకలో 'కొత్త' నాయకత్వంపై కత్తిపోటు
ప్రతిపక్షాలపై పడుతుంది ఓటు వేటు

-ఇల్లెందుల దుర్గాప్రసాద్

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• బూజు పట్టిన భద్రత...



ఉమ్మడి రాష్ట్రంలో బూజుతో నిండిన గోడలు, ఎప్పుడు కూలిపోతాయో తెలియని భవంతుల్లోనే రక్షక భటులు విధులు నిర్వర్తించేవారు. వివిధ అవసరాల కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల వసతుల సంగతయితే సరేసరి. ఈ చిత్రంలో పాత బురుజుల్ని తలపిస్తున్న ఈ భవనం నాటి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ది.

• రక్షణకు కొత్త సంసిద్ధత...




కొత్త రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువు అవుతాయన్న వాదనను తిప్పి కొట్టింది తెలంగాణ రాష్ట్రం. నిర్భయంగా, ప్రశాంతంగా జన జీవనం సాగేలా పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టారు కేసీఆర్. రక్షకభట నిలయాలకు కొత్త జీవం పోశారు. అక్కడి వసతుల కల్పన మీదా దృష్టి పెట్టారు. దాని పర్యవసానంగా అవసరమైన ప్రతిచోటా కొత్త పోలీస్ స్టేషన్లను నిర్మించారు. దీంతో ఠాణాలు కొత్త కళను సంతరించుకున్నాయి. ఈ చిత్రంలో కనిపిస్తున్న కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ కేసీఆర్ పాలనకు నిదర్శనం.

## ఫన్‌టాస్టిక్

### నీతులకేం తక్వలేద్!

సవాళ్లకు ప్రతి సవాలుగా 'సత్నారి, ఇత్తారి' అనే ఇద్దరు వ్యక్తులు కేఎస్ఆర్‌టీసీ బస్సులో కర్ణాటకకు వెళ్తున్నారు. సాయంత్రం ఐదున్నర గొడ్తున్నది. ఆ బస్సులో వీరిద్దరే మగ మహారాజులు. తతిమా ప్రయాణికులంతా మహిళామణులే. బస్సు ఇరుకుగా ఉంది. ఇరుకుగా ఉన్నా రోడ్లు సాఫ్‌గా ఉండటం వల్ల వాళ్ల ప్రయాణం సాఫీగా సాగుతున్నది. అందులో 42 సీట్లయితే, సుమారు నూరు మందికిపైగా జనాలున్నరు. 99 శాతం కర్ణాటకకు చెందిన ప్రయాణికులే. వాళ్లెవ్వలో గాదు, అక్కడ ఉపాధి కరువై తెలంగాణకు వలస వస్తున్న కర్ణాటక కూలీలు. రోజువారీగా పని పూర్తవ్వగానే ఇలా రోజూ కర్ణాటకలోని తమ శివారు గ్రామాలకు వెళ్తుంటారట.



టికెట్ తీసుకుందామని కండక్టర్ కోసం సూత్తున్నడు సత్నారి. ఎంతసేపు ఎన్కులాడినా ఎవ్వల్ రాకపోయేసరికి 'టికెట్లిచ్చేటోళ్లు ఎవ్వల్ లేరా?' అని గట్టిగా అరిచిండు సత్నారి. నిద్రపోతున్న కండక్టర్ నిద్రలేసి సత్నారి దగ్గరికి వచ్చి 'ఎక్కడికి వెళ్లాలి సార్..' అనడిగింది. 'ఈ బస్సు ఎక్కడివరకు వెళ్తుంది', 'మీరు ఎక్కడికి వెళ్లాలి సార్', 'ఈ బస్సు ఎక్కడివరకు వెళ్తే అక్కడివరకు.. మాది గమ్యం లేని ప్రయాణం' అని చెప్పడంతో తల కొట్టుకొని మరీ రెండు టికెట్లు సత్నారి చేతిలో పెట్టింది. టికెట్లు తీసుకున్న 'సత్నారి, ఇత్తారి'తో ముచ్చట్లు షురూజేసిండు. వీళ్లు ఇంతకూ ఎక్కడ కూర్చున్నారో తెలుసా? డ్రైవర్ పక్క ఉండే ఇంజిన్‌పైన.

**'అరేయ్ ఇత్తారి కాంగ్రెస్ నేతలు తెగ కోతలు కోస్తున్నార్రా..'**

'అవ్ ఔనురో.. కోతలు కోసుట్ల వాళ్లను ముంచినోళ్లు సారీ మించినోళ్లు లేరురా సత్నారి'

**'అయినా కాంగ్రెస్ నాయకులు చేసే పనేం ఉండది కాబట్టి కోసేది కోతలే కదరా ఇత్తారి? '**

'అరేయ్ వాళ్లు చేసేది పనే కదరా? పనేం ఉండదంటున్నావ్? ఇంతకీ నువ్వు మాట్లాడుతున్న ఏ కోతల గురించిరా సత్నారి'

**'అరేయ్ ఇత్తారి నిన్న రాహుల్‌గాంధీ వరి కోతలు కోసిండు గదరా వాటి గురించే'..**

'ఓర్నీ నేనన్నది.. కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్, మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డిలతో పాటు చోటా బడా నేతలు నోటికి ఎంతవస్తే అంత మాట్లాడుతున్నరు కదా నేను ఆ కోతల గురించి అడుగుతున్నాన్రా...? 'వాళ్లు కర్ణాటక అభివృద్ధి చూపిస్తాం వస్తారా' సవాళ్లు విసిరితే చూసొద్దాం పదా అని పోదామనుకున్నా.. పోతూపోతూ నిన్నూ తీసుకువెళ్తున్నా... విషయం చెప్తే మజ్జలోనే దద్దుకుంటవని చెప్పకుండ తీసుకపోతున్నా..'

**'అబ్బరకొండే సంపినవ్ గదరా?'**

ఒక్కసారి నిద్రపోతున్న మహిళామణులంతా లేసి కూసున్నరు. వీళ్ల లొల్లికే లేసిన్రేమోనని ఇత్తారి గజ్జుమని అనుకుతడు. కానీ, బస్సు తెలంగాణ దాటి కర్ణాటకకు చేరిందని సత్నారికి తెలుసు. అప్పటిదాన్క సౌండ్ లేకుండా సాఫీగా సాగిన బస్సు ప్రయాణం.. ఎక్కడ టైర్లు కూలిపోతదో అనే రేంజ్‌లో ఊగిపోతున్నది బస్సు. అందులో ఉన్న మహిళామణులు కర్ణాటక గవర్నమెంటుపై ఊగిపోతున్నరు.

వాళ్ల మాటలిన్న.. సత్నారి 'అరేయ్.. కన్నతల్లికి సున్నం పెట్టనోడట పిన్నతల్లికి అన్నం పెడుతడంటా' అని ఓ సామెత విసిరేశాడు.

**'అందుకేరా ఇత్తారి నేనన్నది.. కోతలు కోసుట్ల కాంగ్రెస్ నేతలను మించినోళ్లు లేరురా..'**

'గతుకుల రోడ్డే కాదురా సత్నారి, కిటికీలోంచి చూస్తే శిమ్మశీకట్లే కనవడ్తున్నయి. వీళ్లారా మనకు నీతులు చెప్పేది?'

'ఏ డ్రైవర్ సాబ్ బస్సు ఆపుకో.. మేం యూటర్న్ తీసుకుంటం..' అని శెప్పంగనే డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. దెబ్బకు బస్సుకున్న డోర్ ఊశి ఔతలవడ్డది.

■ గడ్డం సతీష్

# దామోదర దోఖా

## సింగూరు పనుల్లో అవినీతి వరద.. మూడుసార్లు గెలిచినా అభివృద్ధి సున్నా

అందోల్ ఫైల్స్

కాంగ్రెస్ నేత దామోదర రాజనర్సింహ్మను అందోల్ నియోజకవర్గం లీడర్‌ను చేసింది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపింది. ఉమ్మడి రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని కల్పించింది. మరి, తనకు ఇంత చేసిన అందోల్‌కు దామోదర చేసింది సున్నా. అందోల్‌ను అభివృద్ధికి దూరంలో ఉంచిన ఘనతను సొంతం చేసుకున్నారు.



తాలెల్మ లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్ల వద్ద రైతులతో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

> కేసీఆర్ సర్కార్ వచ్చాక అందోల్ అభివృద్ధి బాట పట్టింది. క్రాంతికిరణ్ ఎమ్మెల్యేగా గెలిచినంక ప్రగతి పనులు స్పీడందుకున్నాయి. ప్రత్యేక నిధులు తెచ్చారు. ఇవాళ అందోల్ అండర్‌డెవలప్డ్ కాదు. ఆదర్శ నియోజకవర్గం. ఇలా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం.

అందోల్ నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా అభివృద్ధికి మాత్రం దూరం చేశారు గత పాలకులు. నిండని చెరువులు, పారని కాలువలు, ఎండిన పంటలు, గుంతల రోడ్లు... ఇదీ కేసీఆర్ ప్రభుత్వం రాకముందు అందోల్ పరిస్థితి. గత పాలకులు అందోల్‌కు కల్పించిన దుస్థితి ఇది. ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన కేసీఆర్‌కు అందోల్‌తో ప్రత్యేక అనుబంధం ఉన్నది. భౌగోళిక పరిస్థితులు, ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి ఆయన. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే అందోల్ అభివృద్ధిపై దృష్టి సారించారు. ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలని సంకల్పించారు. జోగిపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. దీంతో అందోల్‌లో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ఇప్పుడు కనిపిస్తున్నది.

### చివరి ఆయకట్టుకు సింగూరు జలాలు

దామోదర రాజనర్సింహ్మ డిప్యూటీ సీఎం హోదాలో పనిచేసినప్పటికీ అందోల్ నియోజవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారన్న అసంతృప్తి ఇక్కడి ప్రజల్లో ఉన్నది. అదనంగా నిధులు తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నించలేదనే విమర్శలూ ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి 40 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తానని దామోదర హామీ ఇచ్చారు. ఇందుకోసం చేపట్టిన కాల్వల నిర్మాణ పనుల్లో దామోదర అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. సింగూరు కాల్వల పనుల్లో నాణ్యత లోపించిన కారణంగా చివరి ఆయకట్టుకు నీరందలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి హరీశ్ రావు స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాల్వలు నిర్మించి 40 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చేశారు.



### ప్రతి ఎకరాకూ నీరు

అందోల్ నియోజకవర్గంలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలని కేసీఆర్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం తాలెల్మ ఎత్తిపోతల నిర్మాణం చేపట్టింది. సంగమేశ్వర ఎత్తిపోతల పనులు కొనసాగుతున్నాయి. ఈ పథకం ద్వారా అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్ మండలాల్లోని 66 గ్రామాల్లో 65,816 ఎకరాలకు సాగునీరు అందనున్నది. బసవేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా వట్‌పల్లి, రేగోడ్ మండలాల్లోని 36 గ్రామాల్లో 34 వేల ఎకరాలకు సాగునీరు చేరనున్నది. మల్లన్నసాగర్ 19వ ప్యాకేజీ ద్వారా అందోల్ నియోజకవర్గంలోని 10,131 ఎకరాలకు సాగునీరు అందనున్నది. ఈ పనులన్నీ వేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాలుగా సాగునీరు లేక ఇబ్బందులు పడ్డ ఇక్కడి రైతన్నల జీవితాలు మారుతున్నాయి.



### అందోల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.152.48 కోట్లతో మిషన్ కాకతీయ కింద 774 చెరువులను పునరుద్ధరణ.
- రూ.132.99 కోట్లతో సింగూరు ప్రాజెక్టు కాల్వల నిర్మాణం, మరమ్మతు పనులు పూర్తి
- మంజీరా నదిపై రూ.3.87 కోట్లతో రెండు చెక్‌డ్యాంల నిర్మాణం
- మినీ ట్యాంక్ బండ్‌గా అందోల్ చెరువు అభివృద్ధి. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.25 కోట్ల అందోల్-జోగిపేట మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- 100 పడకల దవాఖాన నిర్మాణం. ఆక్సిజన్ ప్లాంట్, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు
- రూ.100 కోట్లకు పైగా నిధులతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా
- రూ.250 కోట్లతో రోడ్లు, భవనాల నిర్మాణం
- రూ.3.80 కోట్లతో 19 నూతన పంచాయతీ భవనాల నిర్మాణం
- జోగిపేటలోని చారిత్రక క్లాక్‌టవర్ పునరుద్ధరణ.
- 25 రైతు వేదికల నిర్మాణం. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.5 లక్షల వ్యయం
- నియోజకవర్గంలో 1350 డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం
- మునిపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ల ఏర్పాటుకు పూర్తయిన భూసేకరణ ప్రక్రియ.

## ద లీడర్..



# 'హోం' టు హోం మినిస్టర్..

### ప్రజా క్షేత్రం.. సుదీర్ఘ ప్రస్థానం..
### పట్లోళ్లది 45 ఏండ్ల రాజకీయ చరిత్ర
### భర్త అడుగుజాడల్లో పయనం

**పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి.. దేశంలోనే తొలి మహిళా హోంశాఖ మంత్రిగా.. దివంగత మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి భార్యగా అందరికీ సుపరిచితమే. భర్త మరణానంతరం..అనూహ్య రీతిలో ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయాలకు రాక ముందు వరకు ఆమె ఓ సాధారణ గృహిణి. రాజకీయాల్లో ఓనమాలు కూడా తెలియదు. అనతికాలంలోనే పట్టుసాధించి ఎందరో రాజకీయ దురంధరులను మట్టికరిపించి శక్తివంతమైన మహిళా నేతగా ఎదిగారు.**

చేవెళ్ల, మహేశ్వరం నియోజకవర్గాల నుంచి సబితారెడ్డి వరుస విజయాలు సాధిస్తూ వచ్చారు. 2000, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి, 2009, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి గెలుపొందారు. తొలి మహిళా హోం మంత్రిగా పదవికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కమిట్‌మెంట్‌తో చేస్తున్న అభివృద్ధిని కండ్లారా చూశారు. తన నియోజకవర్గాన్నీ అభివృద్ధి పథంవైపు నడిపించాలని బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెను ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.

### ఉద్యమానికి అండగా..

ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న తెలంగాణ ఉద్యమ సమయంలో సబితారెడ్డి హోం మంత్రిగా ఉన్నారు. తన భర్త కూడా ప్రత్యేక తెలంగాణ కోసం ఆరాటపడ్డాడు. జై తెలంగాణ పార్టీని స్థాపించి కొంతకాలం నడిపించారు. అప్పట్లో తెలంగాణ ప్రాంతం ఏవిధంగా వివక్షకు గురైందో భర్త చెబుతున్న విషయాలను నెమరు వేసుకున్నారు. ఉద్యమకారుల అనేక నిరసన కార్యక్రమాలకు పోలీసులతో అనుమతులు ఇప్పించారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేకపోయినా పరోక్షంగా సహకారం అందించారు.



### చేవెళ్ల చెల్లెమ్మగా...

సబితారెడ్డి వికారాబాద్ జిల్లా కోటబాస్పల్లిలో జన్మించారు. మామయ్యకు పిల్లలు లేకపోవడంతో పెంచుకున్నారు. రెడ్డి కాలేజీలో చదువుతున్నప్పుడు ఇంద్రారెడ్డితో వివాహం జరిగింది. ఇంద్రారెడ్డిది చేవెళ్ల నియోజకవర్గంలోని కౌకుంట్ల గ్రామం. చిన్నపాటి వ్యాపారం చేస్తూనే రాజకీయాల్లోకి వచ్చారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. హోం మంత్రితో పాటు వివిధ హోదాల్లో పనిచేశారు. తిరుగులేని నేతగా ఎదుగుతున్న సమయంలోనే 2000 సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పటి వరకు గృహిణిగా ఉన్న సబితారెడ్డి భర్త ఆశయ సాధనకు రాజకీయాల్లోకి వచ్చారు. ఉపఎన్నికలో పోటీ చేసి విజయం సాధించారు. ఇంద్రన్న క్యాడర్‌కు అండగా నిలిచారు. చేవెళ్ల చెల్లెమ్మగా ఎదిగారు. ప్రజలకు 'అమ్మ'గా అన్నీతానై వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున పోటీలో ఉన్నారు.

■ సెలబ్రిటీ స్పెషల్

# తెలంగాణకు గ్రీన్ కలర్ ఇచ్చిన గులాబీ

ఒకప్పుడు తెలంగాణ తాగునీటి సమస్యను, హైదరాబాద్‌లోని ట్రాఫిక్ సమస్యను ఎక్కువగా చూశానని, ఇప్పుడు ఈ రెండు సమస్యలూ పరిష్కారమయ్యాయని అంటున్నారు సినీ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్. 'నమస్తే తెలంగాణ'తో ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు చెప్పారు.



**కొత్త రాష్ట్రంవచ్చాక సినిమాల విషయంలో ఏమైనా తేడా గమనించారా?**

తెలంగాణ మాండలికానికి చెందిన సినిమాలు ఎక్కువగా వస్తున్నాయంటే అదంతా కొత్తరాష్ట్రం చలువే కదా. అందరు హీరోలూ తెలంగాణ నేటివిటీని ట్రై చేస్తున్నారంటే మనం గెలిచినట్టేగా.

**ఈ పదేండ్లలో హైదరాబాద్‌లో మీరు చూసిన మార్పు ?**

చాలా ఉన్నది. హైదరాబాద్ అభివృద్ధిని ప్రభుత్వం పరుగులు పెట్టించింది. కొన్నేండ్ల క్రితం వరకూ హైదరాబాద్ అంటే కొంత చిన్నచూపు ఉండేది. చెన్నై, బెంగళూరులకు ఇచ్చిన ప్రయారిటీ మనకుండేది కాదు. ఇప్పుడు అక్కడి నుంచి కూడా ఇక్కడికొచ్చి జీవిస్తున్నారు. ఇది నిజంగా గర్వపడాల్సిన విషయం.

**గతంలో హైదరాబాద్‌కు, ఇప్పటికీ తేడా ఎలా ఉంది ?**

సదుపాయాలు చాలా పెరిగాయి. హైదరాబాద్ ఓ చిన్న దేశం లాంటిది. రోజుకు వేలాది మంది ఇక్కడకు బతకడానికి వస్తుంటారు. నిజానికి ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండాలి. కానీ, ప్రభుత్వం కొత్తగా చాలా ఫ్లైఓవర్లు నిర్మించడంతో ట్రాఫిక్ సమస్య చాలావరకు తగ్గింది.

**తెలంగాణ గ్రామీణ ప్రాంతాలు గతంలో ఎలా ఉన్నాయి ? ఇప్పుడు ఎలా ఉన్నాయి ?**

తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగాయి. ఒకప్పుడు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో బోర్లు వేయడం పెద్ద ప్రహసనమే. వందల అడుగులు వేస్తే గానీ నీళ్లు పడేవి కావు. ఇప్పుడు తేలిగ్గా నీళ్లొస్తున్నాయని మా వరంగల్ మిత్రులు చెబుతున్నారు. ఆనందం అనిపించింది. రోడ్లు చాలా బాగున్నాయి. గ్రీనరీ కూడా అద్భుతంగా పెరిగింది. సీఎం కేసీఆర్, కేటీఆర్ హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఈ రోజు ఎటువైపు చూసినా తెలంగాణ పచ్చగా కనిపిస్తున్నది. పింక్ కలర్ తెలంగాణకు గ్రీన్ కలర్‌నిచ్చింది అని గట్టిగా చెప్పొచ్చు.